కృష్ణంగా



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఒంగోలులో నిర్వహిస్తున్న రాజశ్యామల యాగం శుక్రవారం పూర్ణాహుతితో ముగిసింది. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పూజల్లో పాల్గొని బాలినేని దంపతులకు అభినందనలు తెలిపారు.

- ఒంగోలు టౌన్

క్రీడాస్ఫూర్తితో మెలగాలి



గ్రామంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: క్రీడాకారులు తమ క్రీడల్లో ఎలాంటి భేషజాలకు పోకుండా క్రీడాస్ఫూర్తితో మెలగాలని మండల పరిషత్ అధ్యక్షులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. ఒమ్మెవరం గ్రామంలో బి.ఆర్.అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్‌ల జయంతి సందర్భంగా షద్రక్, అనీల్ మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రకాశం, బాపట్ల జిల్లాల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం తొలి మ్యాచ్‌గా తలపడనున్న ఒంగోలు, రాచపూడి జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎంపీపీ దంపతులు సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, మద్దిసాని నాగేశ్వరరావు, గండు హరిబాబు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో రెండిళ్లలో చోరీ

ఒంగోలు టౌన్: నగరంలోని రాజీవ్‌నగర్ హెల్ప్ కార్యాలయం వద్ద గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న జేవీఎస్ శాస్త్రి కుటుంబసభ్యులతో కలిసి విజయవాడలో ఉంటున్న కూతురి వద్దకు వెళ్లారు. గత కొద్ది రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు మెయిన్ డోర్‌ని విరగగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. కప్ బోర్డులు, బీరువాలో ఉన్న సామాన్లు అంతా వెదికారు.అయితే విలువైన వస్తువులేమీ దొరకలేదు. దేవుని చిత్రపటం వద్ద ఉన్న అరకిలో వెండి కుందులనే తీసుకొనిపోయారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే వీధిలోని దేవరపల్లి రామకృష్ణారెడ్డి ఉపాధ్యాయుడిగా చేసి రిటైరయ్యారు. అమెరికాలో ఉంటున్న కూతురిని చూసేందుకు జనవరి 27న కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటికి వేసి ఉన్న తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో వెతికినా విలువైన వస్తువులు దొరకలేదు. ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్ రావు చోరీ జరిగిన ఇంటికి చేరుకొని పరిశీలించారు. తాలుకా సీఐ రాంబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని మాజీ మండల యూత్ అధ్యక్షుడు తంబి కాంతారావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. తంబి వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా శ్యామ్యూల్

ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా శ్యామ్యూల్ ఎన్నియ్యారు. శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షులు కె.గోవిందరాజులు వ్యవహరించారు. నూతన కమిటీలో ఎంపికన వారిలో అసోసియేట్ అధ్యక్షులుగా మినీ సుందరి, ఉపాధ్యక్షులుగా కేవీ రమణారెడ్డి, కార్యదర్శిగా మజహర్ సుల్తానా, జాయింట్ సెక్రటరీగా యు సునీత, కోశాధికారిగా ఎస్కే షబ్బీర్, కో ఆప్షన్ మెంబర్‌గా ఐ విజయలు ఎంపికవ్వగా ఈసీ సభ్యులుగా బాల చెన్నమ్మ, కార్తీక్ నారాయణ, ఉదయ్, షబీరాలు ఎన్నియ్యారు.

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలే మేలు

ఒంగోలు టౌన్: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జెడ్పీ ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.జాలిరెడ్డి అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు, గోడ పత్రికను ఆవిష్కరించిన ఆయన అగ్నిమాపక పరికరాల ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పది అగ్నిమాపక కేంద్రాల్లో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు విపత్తులు, అగ్నిమాపక సేవల జిల్లా అధికారి ఎస్.వేణుగోపాల్ తెలిపారు.కార్యక్రమంలో ఏడీఓ వి.శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు స్పందన కరువు



చీమకుర్తిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న బాలినేని, పక్కన బూచేపల్లి, ఎంపీ నందిగం, ఎమ్మెల్యేలు టీజేఆర్, బలరాం,జంకె, శివప్రసాదరెడ్డి,



జిమ్‌ను ప్రారంభించిన బాలినేని, బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్, కరణం, శివప్రసాదరెడ్డి

- పాదయాత్ర చేస్తే అధికారం వస్తుందని భావిస్తున్నాడు : బాలినేని
- మీరు పీకిందేమీ లేదంటూ దళితులపై లోకేష్ చిన్నచూపు: ఎంపీ నందిగం
- చీమకుర్తిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న బాలినేని, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ నందిగం . ఎమ్మెల్యేలు టీజేఆర్, బలరాం, జంకె, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: పాదయాత్ర చేస్తే అధికారం వస్తుందేమోననే ఉద్దేశంతో లోకేష్ పాదయాత్ర చేస్తున్నాడు తప్ప ప్రజల్లో స్పందన లేదని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రపై విమర్శనాస్త్రాలు సంధించారు. శుక్రవారం రాత్రి చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలినేనితో పాటు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు టీజేఆర్ సుధాకర్‌బాబు, కరణం బలరాం, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ లోకేష్ పోటీ చేసిన నియోజకవర్గం పేరు కూడా సరిగ్గా పలకలేడు గానీ ఆయన సీఎం కావాలని పాదయాత్ర చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, తిరిగి మనందరం కలిసికట్టుగా జగన్‌ని సీఎంగా గెలిపించుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బాలినేని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించటం అభినందనీయమన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవితాంతం ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. బాపట్ల పార్లమెంట్ సభ్యుడు నందిగం సురేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌ని దగ్గర నుండి చూస్తే లోకేష్ గుండె ఆగి చస్తాడని, అలాంటి తత్తరగాడు సీఎంను పట్టుకొని అరె, ఒరె జగన్ రెడ్డి అనటం ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు దళితుల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారాఅని గతంలో మాట్లాడి దళితులను అవమానిస్తే, ఇప్పుడు ఆయన కుమారుడు లోకేష్ దళితులను కించపరుస్తూ మీరు పీకిందేమీ లేదని అవమానకరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. 1019 ఎన్నికల్లో చంద్రబాబుకు 23 సీట్లతో పీకి పక్కన పెట్టింది దళితులు, బీసీలేనని ఘాటుగా స్పందించారు. చిరంజీవి సభలకు 10 లక్షలు మంది వస్తేనే ఆయనకు 18 సీట్లు వచ్చాయని, అలాంటప్పుడు పవన్ కల్యాణ్‌కు ఎన్ని సీట్లు వస్తాయో ఆయనే లెక్కలేసుకోవాలని, అర సీటు కూడా రాదని ఎంపీ నందిగం ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేలు టీజేఆర్ సుధాకర్‌బాబు, కరణం బలరాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. తొలుత చీమకుర్తి ప్రభుత్వాస్పత్రి వద్ద బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి పేరుతో నిర్మించిన ఆర్చిని, 5వ సచివాలయం పక్కన ఓపెన్ జిమ్‌లను ప్రారంభించిన అనంతరం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ జ్యేష్ఠ శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాపతు వెంకటరెడ్డి, నలమల మాణిక్యం, డాక్టర్ జవహర్, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రి ఆర్చిని ప్రారంభిస్తున్న బాలినేని, బూచేపల్లి, టీజేఆర్, కరణం, జంకె

ప్రపంచ మేధావి అంబేడ్కర్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు



మద్దిపాడు మండలపరిషత్ కార్యాలయంలో బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంపీపీ



మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి



యరజర్లలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సర్పంచ్ రాములమ్మ, తమ్మిశెట్టి శ్రీనివాసులు



మజ్జిగ పంపిణీచేస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.లక్ష్మానాయక్ తదితరులు,



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కొనియాడారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బూచేపల్లి వెంకాయమ్మ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పేదరికంలో పుట్టి ప్రపంచంలోని గొప్ప యూనివర్సిటీల్లో చదువుకున్న అంబేడ్కర్ భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచమంతా ఇనుమడింప చేశారని కొనియాడారు. నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, అంగిరేకుల గురవయ్యతో, ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఒంగోలు ఈఈ కే.గోపీనాయక్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. డీఏఓ బి.బాబూరావు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బత్తుల నరేంద్ర కుమార్, గుంజి రాంబాబు, రామకృష్ణ, నరశింహారావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. రామ్‌నగర్‌లోని విద్యుత్ భవన్ వద్ద బహుజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తేళ్ల అంజయ్య, కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్ఎస్ పుచ్చరాజు పాల్గొన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత పారిశుధ్య కార్మికులు మస్టర్ పాయింట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఒంగోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు వాడవాడలా నిర్వహించారు. స్థానిక కబాడీపాలెం అంబేడ్కర్ సర్కిల్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మాసుపల్లి రాజేష్ అధ్యక్షతన పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాజీ కౌన్సిలర్ కట్టా సుధాకర్, యాదాల రాజశేఖర్, రైల్వే ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు కట్టా కృష్ణమూర్తి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఎద్దు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక హెచ్‌సీఎం కాలేజీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు, సాంఘీక సంక్షేమశాఖ అధికారి లక్ష్మణ్ నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఏపీఆర్ఓ డి.దుర్గాప్రసాద్ పాల్గొని మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. నిర్వాహకులు మధిర శ్రీమన్నారాయణ, వేలూరి తులసీ రామ్, కళ్యాణ్ చక్రవర్తి, వేలూరి శ్రీనివాసరావు, అంగలకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.
- స్థానిక గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో డాక్టర్ మణిబాబు, కార్పొరేటర్లు చల్లా తిరుమలరావు, ఎందేటి పద్మావతి రంగారావు , వైఎస్సార్‌సీపీ నాయకులు కావాటి రవి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు అన్నదానం చేశారు. కసుకుర్తి కరుణాకర్, పాఠశాల ఇన్‌చార్జి స్వర్ణ మోహన్‌రావు, కమలాకర్, కసుకుర్తి శ్రీను, ప్రసాద్, పాలేటి శ్రీను పాల్గొన్నారు.
- బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌సీఎం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చినయోగయ్య యాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు సెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరుగుమల్లి మండలం కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎం.స్రవంతి, దర్శి మండలం పొతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పి.సుశీలను ఆఫీస్ సబార్డినేట్లుగా కారుణ్య నియామక పత్రాలను అందించారు.

ఒంగోలు అర్బన్: అంబేడ్కర్ జయంతిని ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్‌చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో పనిచేసే ఎంఎన్‌ఓలు, మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు రోగుల సౌకర్యం కోసం రెండు వీల్‌ఛైర్స్‌ను ఆసుపత్రి అధికారులకు అందచేసారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీనాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, నర్సింగ్ సూపరింటెండెంట్ బి సంపూర్ణమ్మ, ఆర్ఎంఓ చైతన్యవర్మ, డాక్టర్‌లు తిరుమలరావు, రిచర్డ్స్ పాల్గొన్నారు. యరజర్లలో సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ, తమ్మిశెట్టి శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఒంగోలు టౌన్: నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రచయితల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, మిడసల మల్లికార్జునరావు, కనకమాల రాఘవులు, డాక్టర్ నూనె అంకమరావు, కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, బీరం అరుణ, నున్నా ఆంజనేయులు, రాయపాటి ఆశీర్వాదం, ఐ.నరసింహరావు, బాబురావు పాల్గొన్నారు.

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో జై భీమ్ యూత్ ఫోర్స్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి బైక్ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రం మద్దిపాడు సెంటర్‌లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అంబేడ్కర్ విగ్రహానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సెంటర్‌లో మోరబోయిన సంజీవరావు ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైస్ ఎంపీపీ పైడి పాటి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డిని, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావును అభినందించారు. రక్తదాన శిబిరం నిర్వహించిన తరువాత అన్నదానం చేశారు. ఆయన వెంట ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, రాష్ట్ర యువత జనరల్ సెక్రటరీ పాకనాటి మహానందరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: వెలివేత సమాజం నుంచి తనను తాను మలచుకొని భారతదేశ దశ, దిశలను నిర్ధారించే స్థాయికి ఎదిగిన మహనీయుడు అంబేడ్కర్ అని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. బీ.ఆర్.అంబేడ్కర్ 132 వ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంతో నాటు ఒమ్మెవరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చదలవాడ లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్ బాబు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మట్టిగుంటలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, వైఎస్సార్ సీపీ నాయకురాలు దారా పద్మజ గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలతో నివాళులర్పించారు. కండ్లగుంట, వినోదరాయునిపాలెం గ్రామాల సర్పంచ్‌లు పల్లెర్ల అంజిరెడ్డి, ఘట్టమనేని అశోక్‌లు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప్పుగుండూరులో అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధాకర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఇస్తర్ల అంజయ్య, పోలినేని కోటేశ్వరరావు, పల్లెర్ల అంజిరెడ్డి, ఢాకా అంజిరెడ్డి, మద్దిసాని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కొత్తపట్నం: మండలంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కొత్తపట్నం దళితవాడ, పాదర్తి, బీరంగుంట, అల్లూరు బస్టాండ్, వజ్జిరెడ్డిపాలెం, రాజుపాలెం, మడనూరు ఎస్సీ కాలనీ, సంకువారిగుంట పాత, కొత్త కాలనీల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్లు మేడికొండ రాంబాబు, అనూష, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు ఆయన రచించిన రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. ఎంపీడీఓ పి.సుజాత, సంకువారిగుంట సర్పంచ్ కసుకుర్తి సుబ్బరత్నమ్మ, సొసైటీ అధ్యక్షుడు దుగ్గిరాల విజయ్‌కుమార్, లీలా మోహన్, కె.వెంకట్రావు, ఏ.రోశయ్య, ఉప సర్పంచ్ సీహెచ్ మురళీ, సుబ్బారావు, అంబటి వందనం, ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

చీమకుర్తి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వారు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకు ఛీజీ దుడ్డు వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ కళాపరిషత్ అధ్యక్షులు దాసరి హనుమంతురావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పీ కాలనీలో డాక్టర్ బీ.జవహర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్‌టీయు ఆధ్వర్యంలో పలువురు టీచర్‌లు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల సుబ్బారావు నేతృత్వంలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు ఆధ్వర్యంలో యూటీఎఫ్ ఆఫీస్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఎల్ పురంలో సర్పంచ్ పుల్లగూర రమణమ్మ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



నగరపాలక సంస్థ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, కమిషనర్

రీసర్వేతో భూములకు శాశ్వత హక్కు

చీమకుర్తి: రీసర్వే ద్వారా ప్రజల భూములు, ఆస్తులకు శాశ్వత హక్కు కల్పిస్తారని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. పట్టణంలో శుక్రవారం డ్రోన్‌ల సర్వే ద్వారా భూముల రీసర్వేను ప్రారంభించారు. అధికారులు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.



రీసర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదినోత్సవం

ఒంగోలు: స్థానిక కొత్తపట్నం బస్టాండ్ కూడలిలోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి జన్మదినం, ఆలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కాలే వెంకటేశ్వర్లు, కార్యదర్శి పువ్వాడ సురేష్‌కుమార్ , కోశాధికారి నాళం శివగోవర్ధన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఓరుగంటి సుబ్బరామయ్య శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.